7న బాల బృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం బాల బృందావనం కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 9 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకు పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా 'హ్యాపీ న్యూ యూవ్' పేరిట ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని సూచించారు.

ప్రతి గడపకు పథకాలు అందేలా కృషి



గోకుల్‌ప్లాట్స్ ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

హఫీజ్‌పేట్ : కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రతి గడపకు అందేలా చూస్తామని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్‌ప్లాట్స్‌లో నిర్వహిస్తున్న ప్రజాపాలన కేంద్రాలను ఆయన సందర్శించి పరిశీలించారు. డివిజన్ నాయకులు నాగేశ్వరరావు, శ్రీను, సత్యం, వీరరెడ్డి, మహిళలు లక్ష్మీ, వినీత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: పార్లమెంటు ఎన్నికలలో చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యత అందరిదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో జరిగిన చేవెళ్ళ పార్లమెంటు నియోజకవర్గం సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైనికుడిలాగా పనిచేయాలని, సమిష్టి కృషితో విజయం సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త, నాయకుడు కలిసి కట్టుగా ముందుకు నడుస్తూ పార్టీ విజయం సాధించేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే శ్రీరామరక్ష అని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

నెక్సస్ మాల్‌లో పండగ సందడి



కూకట్‌పల్లి: సంక్రాంతి పండగను పురస్కరించుకొని కూకట్‌పల్లిలోని నెక్సస్‌మాల్‌లో సందడి మొదలైంది. రంగోలి పోటీ, చిన్నారులకు గాలిపటాలు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక ఎండ్ ఆఫ్ సీజన్ సేల్ ఉంటుందని ఇది జనవరి 14వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనవరి 13న రంగోలి పోటీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్ట్ ఎగ్జిబిషన్



విద్యార్థులు వేసిన చిత్రాలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడలోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం 'మేరు అంతరాగ్ని' ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. సుమారు 400లకు పైగా ఆర్ట్ వర్క్ చేశారు. బెస్ట్ ఔట్ ఆఫ్ వేస్ట్, ప్రకృతిని కాపాడుతూ సేవ్ ఓషన్స్, శిల్పకళ, చార్‌కోల్, ఆక్రిలిక్, వాటర్ పెయింటింగ్ తదితరులను ప్రదర్శించారు. ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో పెయింటింగ్‌లను అమ్మకాలకు పెట్టారు. వచ్చిన డబ్బులను చారిటీకి అందిస్తామన్నారు. విద్యార్థులు కళల్లో తమ ప్రతిభ చాటేలా చేస్తున్నామన్నారు.

ఎమ్మెల్యే గాంధీని కలిసిన బ్రహ్మకుమారీస్



గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధుల బృందం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని శుక్రవారం ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బ్రహ్మకుమారీస్ సంస్థ కార్యక్రమాలను వివరించారు. బ్రహ్మకుమారీస్ కేంద్రాన్ని సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

- టాస్కులు, కమిషన్‌ల పేరుతో మోసం
- రూ.15 లక్షలు పోగొట్టుకున్న వైనం

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.15 లక్షల 18 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని వెంకటరమణ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ డిసెంబర్ 20 వ తేదీన తన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.3 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు.కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.15 లక్షల 18 వేలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమిషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నకాషీ చిత్రకళ











గచ్చిబౌలిలోని కేంద్రీయ విద్యాలయలో చేర్యాల్ పెయింటింగ్ వేస్తున్న విద్యార్థులు



ప్రత్యేక శిక్షణలో పాల్గొన్న 70 మంది విద్యార్థులు

రాయదుర్గం: నకాశీ చిత్రకళపై 70 మంది విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ప్రముఖ పెయింటింగ్ మేరుగోజు మధు పర్యవేక్షణలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ జితేంద్రకుమార్, ఆర్ట్ టీచర్ శివకుమార్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. తెలంగాణలో నకాశీ చిత్రకళకు 400 ఏళ్లకుపైగానే చరిత్ర ఉంది. ఇది సిద్దిపేట జిల్లాలోని చేర్యాలకు ప్రత్యేకం. ఇది పురాతన కళల్లో ఒకటిగా గుర్తింపు పొందింది.

- ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విభాగం ఆధ్వర్యంలో కేంద్రీయ విద్యాలయ విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు ప్రతిసారీ సరికొత్త అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.
- నకాశీ కళపై గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మూడు రోజుల్లోనే విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు.





చిత్రకళలపై అవగాహన పెంచుతున్నాం



విద్యార్థులకు చదువుతోపాటు చిత్రకళలపై అవగాహన పెంచుతున్నాం. చేర్యాల నకాశీ కళపై ప్రత్యేక వర్క్‌షాప్ పెట్టించి 70 మంది విద్యార్థులకు శిక్షణ ఇప్పించాం. వారు అందులో రాటుదేలి అందరినీ ఆకట్టుకునేలా చిత్రాలు గీశారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఆర్ట్ విభాగం విశేషమైన పాత్ర పోషిస్తోంది.

–జితేంద్రకుమార్, ప్రిన్సిపల్, గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయ

వేధింపులు ఎదురైతే ధైర్యంగా చెప్పండి

టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్ కమాండెంట్ సన్నీ



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కమాండెంట్ సి.సన్నీ

గచ్చిబౌలి: మహిళా ఉద్యోగులు పని చేసే చోట వేధింపులు ఎదురైతే ధైర్యంగా చెప్పాలని టీఎస్ఎస్పీ 8వ బెటాలియన్ కమాండెంట్ సి.సన్నీ సూచించారు. శుక్రవారం కొండాపూర్ బెటాలియన్‌లో మహిళా ఉద్యోగుల లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఎవరైనా మీ పట్ల లైంగిక ఇబ్బందులు కల్గించడం, అమర్యాదగా ప్రవర్తిండం చేస్తే కమిటీ సభ్యులకు ఫిర్యాదు చేయాలన్నారు. తోటి మహిళ ఉద్యోగులను అక్కా చెల్లెల్లుగా భావించి ప్రతి ఒక్కరు గౌరవించాలని ఆయన పేర్కొన్నారు. బెటాలియన్ క్యాంపస్‌లో పని చేస్తున్న మహిళ ఉద్యోగుల నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. కార్యక్రమంలో కొండాపూర్ బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.నిర్మల, సూపరింటెండెంట్ లక్ష్మీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా సరోజనమ్మ గుట్ట



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెల సరోజనమ్మ గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం జరిగిన సరోజనమ్మగుట్ట జాతరలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గుట్ట అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గుట్టపై భక్తుల కోసం వసతి సౌకర్యాలు, ఆలయ ప్రాంగణం విస్తరణ పనులు చేపడతామని తెలిపారు. గుట్ట చుట్టూ ఆయుర్వేద మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ లలిత సోమిరెడ్డి, కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, ఒగ్గు సుచరిత కొమురయ్య , బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

కూకట్‌పల్లి: హెచ్‌యంటి శాతవాహననగర్‌లో అక్రమ నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తున్న నిర్మాణాన్ని డిసిపి సుస్మిత, టీపీఎస్ సోమేశ్వర్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బస్సులో బంగారు గొలుసు చోరీ

భాగ్యనగర్‌కాలనీ: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ మెడలో ని గొలుసు అపహరణకు గురైన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. డీఐ రాజేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మోతీనగర్ అవంతినగర్‌లో నివాసముంటున్న ఆర్. సంగీతరెడ్డి పని నిమిత్తం ఎర్రగడ్డ నుంచి హైదర్‌నగర్ వరకు ఆర్‌టిసి బస్సులో బయలుదేరింది. జేఎన్‌టీయు బస్టాప్ వద్ద బస్సు దిగింది. ఈ క్రమంలో తన మెడలో ఉన్న 45 గ్రాముల బంగారు చైన్ కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జంట సర్కిళ్లలో 11,136 దరఖాస్తులు

శేరిలింగంపల్లి/హఫీజ్‌పేట్: ప్రజాపాలన కార్యక్రమంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో శుక్రవారం 11,136 దరఖాస్తులు వచ్చాయి. అందులో 7,304 దరఖాస్తులు ఆరు గ్యారంటీలపై రాగా, 3,832 దరఖాస్తులు ఇతర అంశాలపై వచ్చాయి. చందానగర్ సర్కిల్ పరిధిలో మొత్తం 5,836 దరఖాస్తులు రాగా అందులో ఆరు గ్యారంటీలపై 3,804 దరఖాస్తులు, ఇతర అంశాలపై 2,032 వచ్చాయి. కాగా శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో మొత్తం 5,300 దరఖాస్తులు వచ్చాయి, అందులో 3,500 దరఖాస్తులు ఆరు గ్యారంటీలకు, మిగతావి ఇతర అంశాలపై వచ్చాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టిన ఘటనలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం పాటి గ్రామ శివారులోని ఓఆర్ఆర్‌పై గురువారం సాయంత్రం వాహనం ఢీకొని, గుర్తుతెలియని వ్యక్తి సుమారు (40–45)కి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి సంబంధించిన వారు బీడీఎల్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోమ్ హెల్త్ ఎయిడ్ కోర్సులో ప్రవేశాలు

కూకట్‌పల్లి: రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో ఆరోగ్య భద్రతపై నైపుణ్యతను పెంచేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నారు. ఈ నెల 8నుంచి తరగతులు మొదలు కానున్నాయని నిర్వాహకులు తెలిపారు. హోమ్ హెల్త్ ఎయిడ్ కోర్సులో ప్రవేశాలకు ఆసుపత్రి వర్గాలు ఆసక్తి గలవారినుంచి దరఖాస్తులు కోరుతున్నారు. 9 వారాల పాటు సాగే శిక్షణకు కనీసం 10వ తరగతి వరకు చదువుకున్న వారు అర్హులని తెలిపారు ఆసక్తి కలిగిన వారు రామ్‌దేవ్‌రావ్ హాస్పిటల్, కుముదినిదేవి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి



విద్యార్థులతో కొండా విజయ్‌కుమార్

మియాపూర్ : విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు పాఠశాలల యాజమాన్యాలు ప్రణాళికతో ముందుకు వెళ్లాలని తెలంగాణ రాష్ట్ర హాకీ అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ అన్నారు. మియాపూర్ జేపీనగర్‌లోని సంస్కృతి పాఠశాలలో నిర్వహించిన క్రీడా దినోత్సవంకు విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాలలో నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ పోలీస్ అధికారి డాక్టర్ రాజా శిఖామణి, పాఠశాల డైరెక్టర్ సురేష్‌బాబు, ప్రిన్సిపాల్ తృప్తి ఓరా, డైరెక్టర్లు వినూత్న, శుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.98 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో రూ.2.98 కోట్లతో తలపెట్టిన అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. శుక్రవారం పురపాలక సంఘం కార్యాలయంలో చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సభ్యులు సమావేశమయ్యారు.ఈ సమావేశంలో కమిషనర్ జ్యోతి రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ నందారం నరసింహాగౌడ్ పాల్గొన్నారు. సమావేశంలో పట్టణంలో నెలకొన్న సమస్యలపై చర్చించి, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధికి రూ.2.98 కోట్లు కేటాయించారు. పనుల నిర్వహణకు ఆమోదం తెలిపారు. కౌన్సిల్ సభ్యులు వారి వార్డులలో రోడ్లు, నీటి సరఫరా పైప్‌లైన్‌కి సంబంధించిన పనులను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు.అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిందని పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రైవ్‌లో 07 మంది పట్టుబడ్డారని వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి ఒక్కొక్కరికీ రూ. 10 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

చలాన్ విధించి.. నంబర్‌ప్లేట్ బిగించి..

కుత్బుల్లాపూర్: అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి చలానా విధించి కొత్త నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయించారు. అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుచిత్ర, దూలపల్లి చౌరస్తా, కొంపల్లి, జీడిమెట్ల తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాహనాల తనిఖీ చేశారు. ముఖ్యంగా నంబర్ ప్లేట్లు లేకుండా వెళ్తున్న వాహనాలను ఆపారు. వారి వద్ద ఉన్న పత్రాలను చూసిన తర్వాత జరిమానా విధించి కొత్తగా నంబర్ ప్లేట్లు తయారు చేసి బిగించే ఏర్పాట్లు చేయడం విశేషం.